అడల్ట్స్ ఓన్లీ కథ

# ఎంత ఎంత ఎడమైతే... అంత తీపి కలయికా!

బాలభానుని లేలేత కిరణాలు జగతిని మెల్లగా మేల్కొలుపుతున్న వేళ... కిలకిలారావాలతో పక్షులు సుప్రభాత గీతాలను ఆలపిస్తున్న సమయాన.. అప్పుడే ట్రైన్ దిగి చేత్తో సూట్‌కేసు పట్టుకొని స్టేషన్ బయటకు వచ్చాడు శరత్. చుట్టూ ఒకసారి పరికించి చూశాడు.


రాత్రంతా కురిసిన మంచు సూర్యకిరణాల తాకిడికి కరిగి పచ్చని ఆకులపై పడి మంచి ముత్యాల్లా మెరుస్తున్నాయి నీటి బిందువులు. రైల్వే స్టేషన్ ముందున్న గార్డెన్‌లో అప్పుడే విచ్చుకుంటున్న పూలు సువాసనలు వెదజల్లుతూ పరిసరాలను పరిమళభరితం చేస్తున్నాయి. ఆ వాతావరణాన్ని చూడడంతోనే ప్రయాణ బడలికను మరచి గుండెలనిండా హాయిగా గాలి పీల్చుకున్నాడు శరత్.

ఇంతలో ''బాబూ బండి కావాలా?'' అంటూ రిషావాడు ఆశగా శరత్ వంక చూస్తూ అడిగాడు. ఈ వయసులో ఆ చలిలో వేకువనే వచ్చే ట్రైన్‌కోసం ఎంతో ఆశగా ఎదురుచూసే ఆ ముసలివాడ్ని చూస్తే చాలా జాలివేసింది శరత్‌కు. మారు మాట్లాడకుండా రిషా ఎక్కి ఎక్కడకు వెళ్లాలో చెప్పి సర్దుకొని కూర్చున్నాడు శరత్.

అది చాలా చిన్న ఊరు కావడం వలన రిషాలు తప్ప ఆటోలు అంతగా వుండవు. రిషా ఎక్కడం అంటే.. మనిషిని మనిషి లాగడమే అనే ఉద్దేశ్యంతో సాధారణంగా రిషా ఎక్కడానికి ఇష్టపడడు శరత్. కానీ ఈరోజు ఆ ముసలివాడిని చూడడంతోనే ఎంతో జాలిగా అనిపించి మారుమాట్లాడకుండా ఎక్కేశాడు. వెంటనే అతడికి తన భార్య కావ్య అనే మాటలు గుర్తుకు వచ్చాయి.

'అది వాళ్ల బ్రతుకు తెరువు.. ఏదో మానవత్వంతో ఆలోచిస్తున్నాము అని అనుకుంటూ వాళ్ళకి పని ఇవ్వకుండా నీలాంటి వాళ్లే పస్తులు పెడుతూ ఉంటారు. మనమిచ్చే డబ్బులతో వాడికి ఒక పూట భోజనం వస్తుంది. నువ్వేదో జాలి చూపిస్తున్నాననుకుంటున్నావు కానీ.. ఆ పేరుతో వాళ్ల కడుపులు కొడ్తున్నావు. అంత జాలిగా ఉంటే మరో రెండు రూపాయలు అదనంగా ఇచ్చి సాయం చేయవచ్చు కదా!'' అంటుంది.

తాను వాదనకు దిగి కావ్య మాటలు తప్పు అని నిరూపించేందుకే ప్రయత్నిస్తాడు గానీ.. అందులో ఉన్న వాస్తవాన్ని అంగీకరించేందుకు ఒప్పుకోడు. తనతో వాదించలేక పాపం కావ్య తనే తగ్గిపోతుంది చివరికి.



**పి. హైమావతి**

ఇప్పుడేం చేస్తూ ఉంటుందో కావ్య? హాయిగా ఆదమరిచి నిద్రపోతూ ఉంటుంది. నేను ఇప్పుడు ఇక్కడికి వస్తానని ఏమాత్రం ఊహించలేదు కదా.. నన్ను చూడడంతోనే తనెంత ఎక్సైట్ అయిపోతుందో చూడాలి. అలా ఆశ్చర్యానందాలకి లోనయినప్పుడు అసలే పెద్దవైన ఆ కళ్లు మరింత విశాలమై దీపాల్లా వెలిగిపోతాయి. వెంటనే ఆ ముఖాన్ని దోసిట్లో ఇముడ్చుకుని అందమైన ఆ నయనాలను, ముద్దులొలికే ఆ పెదాలని ముద్దులతో సత్కరించాలనిపిస్తుంది.

పాపం కావ్య! అకారణంగా తన మనస్సు నొప్పించాను నేను. నన్ను కన్విన్స్ చేయాలని ఎంత ప్రయత్నించింది తను. అయినా నేను మొండిగా నా మాటే నెగ్గాలనే పట్టుదలతో తనని చాలా హర్ట్ చేసాను. చివరికి నిస్సహాయంగా నా వంక చూస్తూ సూట్‌కేసు పట్టుకొని వెళ్లిపోయింది. కనీసం స్టేషన్‌కి డ్రాప్ చేస్తానని కూడా నేను అనలేదు. అలా ఒంటరిగా వెళుతూ ఎంత బాధపడిందో పాపం.. అనుకున్నాడు శరత్.

వెంటనే నాలుగు రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది అతడికి.

''నీమాట నీదేగానీ, నేను చెప్పేది వినిపించుకోవా శరత్. నీకు నీ ఫ్రెండ్ పెళ్లి ఎంత ముఖ్యమో నాకూ నా ఫ్రెండ్ పెళ్లి అంతే ముఖ్యం కదా! మనిద్దరం కలిసి ఈ పెళ్లికి వెళదామని నెల రోజుల క్రితమే రిజర్వేషన్ కూడా చేయించుకున్నాము. అనుకోకుండా నీ ఫ్రెండ్ పెళ్లి కూడా అదేరోజు పడింది. అందుకే నేను నిన్ను నా వెంట రమ్మని కూడా అనలేదు. నన్ను వెళ్లనిమ్మంటున్నాను, అంతే!'' అంది కావ్య.

''దేశంలో నీకొక్కతికే ఫ్రెండ్స్ ఉన్నారు. ఇంకెవరికీ లేరు. నా ఫ్రెండ్ పెళ్లికి మా వాళ్లంతా జంటలు జంటలుగా వస్తారు. నేనొక్కడినే వెళితే ఎంత వెలితిగా ఉంటుంది నాకు? భార్యకు చెప్పుకోలేని చేతకానివాడిలాగా ఒక చెవలాయి కింద జమకట్టి వాళ్లంతా మాట్లాడుతారు తెలుసా?'' అన్నాడు శరత్ కోపంగా.

''ఇది మరీ బాగుంది. వాళ్లేదో అంటారని నా ఫ్రెండ్ పెళ్లి ఎగ్గొట్టి నీవెంట రావాలా? ఎంత అన్యాయం శరత్ ఇదీ. మన పెళ్లికి మూడు రోజుల ముందు నుండీ కీర్తి నా వెంటే ఉండి నాకు ఎంతో సాయం చేసింది. అలాంటిది ఇప్పుడు నేను దాని పెళ్లికి వెళ్లకుండా ఉండడం సరైందేనా? నిన్ను నా వెంట రమ్మని ఫోర్సు చేయడం లేదు కదా'' అంది కావ్య బతిమాలుతున్నట్లుగా.

''ఆ, ఆ వంకన మీ అమ్మగారింట్లో నాలుగు రోజులు తిష్ట వేయవచ్చుని నీ ఆలోచన. నాకు తెలియదనుకున్నావా నీ సంగతి?'' అన్నాడు శరత్ కవ్విస్తున్నట్లుగా.

''అవును నిజమే, అక్కడిదాకా వెళ్లి వాళ్లతో ఒక్కరోజైనా గడపకుండా ఎలా వస్తాను? మీ ఫ్రెండ్ పెళ్లయ్యాక నువ్వు కూడా అక్కడికి వస్తే సరదాగా ఇద్దరం కలిసి తిరిగి వచ్చేద్దాము!'' అంది కావ్య అతడి కవ్వింపు అర్థమైనా కానట్లుగా చూస్తూ.

''అవునవును. నీకు తోకలా నీవెంట వెంటే తిరగాలి కాబోలు నేను!'' అన్నాడు శరత్ విసురుగా.

''ఎందుకు శరత్, ఎప్పుడూ అలా మాట్లాడుతావు? నా వెంట నువ్వు వస్తే అది తోకలా ఉంటుందా.. మరి నేను నీ వెంట మీ వాళ్లందరి ఇళ్లకూ వస్తానే, దాన్నేమనాలి?'' అంది కావ్య బాధగా చూస్తూ.

''ఆ ఏమిటి... అదీ ఇదీ ఒకటేనా? అది నీ బాధ్యత!'' అన్నాడు శరత్ మాటలు వెదుక్కుంటూ.

''ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నావు శరత్! నువ్వు మా ఇంటికి నాతో వస్తే తోకవి. నేను నీ వెంట ఎక్కడికి వచ్చినా అది నా బాధ్యత. నీకో నీతి, నాకో నీతినా... ఇదెక్కడి న్యాయం చెప్పు? నేను నీ వెంట మీ ఫ్రెండు పెళ్లికి రాకపోతే నిన్ను నీ ఫ్రెండ్సంతా చేతకానివాడి కింద జమకట్టి మాట్లాడతారని అంటున్నావు.. కానీ నేను ఈ పెళ్లికి వెళ్లకపోతే మా ఫ్రెండ్సంతా ఏమనుకుంటారో తెలుసా? నువ్వు ఉత్త కర్కోటకుడివి. స్వార్థపరుడివి అని అనుకుంటారు. ఎందుకంటే నేనెలాంటిదాన్నో వాళ్లకి బాగా తెలుసు కనుక, నా గూర్చి తప్పుగా ఏమీ అనుకోరు. అందరూ నీ గూర్చే చెడ్డగా అనుకుంటారు. అది నాకిష్టం లేదు. నీ గూర్చి అందరూ మంచిగానే చెప్పుకోవాలి. ఉన్నతంగానే చూడాలి నిన్ను. నా ఫ్రెండ్ పెళ్లికి వెళ్లాలని ఆశపడడం ఒక కారణం అయితే నిన్నెవరూ తప్పుగా అనుకోకూడదని ఆరాటం మరో పక్క. కానీ నువ్వు మాత్రం నీ మాట నెగ్గించుకోవాలని తప్ప నా మాటల్లోని న్యాయాన్యాయాలను గూర్చి పట్టించుకోవు. నీతో వాదిస్తూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా గడిచి ట్రైన్ చక్కా పోతుంది'' అంటూ సర్దుతున్న సూట్‌కేసును మూసి చేత్తో పట్టుకుంది కావ్య. అయినా ఏమీ మాట్లాడని శరత్‌వంక ఒకసారి చూసి ''సరే నే వెళ్తాను!'' అంటూ హడావుడిగా మెట్లు దిగి వెళుతున్న కావ్యకు అత్తగారు ఎదురుకావడంతో ''వెళ్లొస్తాను అత్తయ్యా!'' అంటూ చెప్పి చకచకా వెళ్లిపోయింది.

## ఐశ్వర్య ఆటోబయోగ్రఫీ

**ఇటీవల వచ్చిన 'జోధా అక్బర్' సినిమాతో మరింత పాపులారిటీని సొంతం చేసుకున్న ఐశ్వర్యారాయ్ తన ఆటోబయోగ్రఫీని వెలువరించాలని తెగ ఉబలాటపడుతోందిట. ఇది ఇప్పటి మాట కాదట. కొంత కాలంగా తన జీవితంలో జరిగిన ప్రధాన ఘట్టాల్ని ఎప్పటికప్పుడు కాగితంపై రాసుకుంటూ భద్రపరుస్తోందిట. బాలీవుడ్‌లోకి వచ్చిన ఈ పదేళ్లలోనూ 30 సినిమాల వరకూ నటించిన ఐశ్వర్య అమితాబ్ ఇంటి కోడలిగా మారడంతో మరింత సంచలనం సృష్టించింది. ఐశ్వర్య ఆటోబయోగ్రఫీ పుస్తకంగా రావాలేగానీ హాట్ కేక్స్‌లా అమ్ముడుపోవు!**



అంత ఫాస్ట్‌గా కావ్య వెళ్లిపోతుందని ఏమాత్రం ఊహించని శరత్ ఉక్రోషంగా భార్య వెళ్లిన వంకే చూస్తూ ఉండిపోయాడు, కనీసం తనని స్టేషన్‌కి డ్రాప్ చెయ్యాలి అనే ఆలోచనే లేకుండా.

హడావుడిగా వెళుతున్న కోడలి వంక ఆశ్చర్యంగా చూస్తూ శరత్ దగ్గరకు వచ్చింది వర్ధనమ్మ. ''అదేమిట్రా శరత్! కోడలు ఒక్కర్తీ అలా వెళ్లిపోతోంది. కాస్త స్టేషన్‌లో దింపి రాకపోయావట్రా?'' అంది.

''వెళ్లనీయమ్మా. తనకి ఎవరి అవసరమూ లేదు. భర్త మాట వినాలనే ఇంగిత జ్ఞానం ఏ కొంచమైనా ఉంటే ఇలా చేస్తుందా?'' అన్నాడు శరత్ కోపంగా.

''అదేంట్రా అలా అంటావు? ఈ పెళ్లికి మీ ఇద్దరూ వెళదామనుకున్నారు కదరా. ఇంతలో నీ ఫ్రెండ్ పెళ్లి వచ్చి పడడంతో అదంతా తారుమారైంది. ఇప్పుడు దాన్ని కూడా వెళ్లొద్దని అనడం ఏం బాగుంటుందిరా?'' అంది వర్ధనమ్మ సర్దిచెప్తున్నట్లుగా.

''బాగో ఓగో నాకు తెలియదు.. నేను వద్దన్నాను కదా! నా మాట మీద ఏ మాత్రం గౌరవమున్నా ఇలా వెళ్లేది కాదు తను!'' అన్నాడు శరత్ విసురుగా.

''ఇందులో గౌరవా, అగౌరవాల ప్రసక్తి ఎందుకురా. ఎంతసేపూ నీ మాట వినలేదనే మొండి పట్టుదలే గానీ తన ఫీలింగ్స్ గూర్చి పట్టించుకోవేంట్రా?'' అంది మదలిస్తున్నట్లుగా.


''ఏం పట్టించుకోలేదమ్మా తనని. ఏం తక్కువ చేశాను చెప్పు తనకి?'' అన్నాడు శరత్ అదే దూకుడుతో.

''ఏమిట్రా తక్కువ చేయడం, ఎక్కువ చేయడమూను. ఇద్దరూ సమానంగా చదువుకున్నారు. సమానంగా సంపాదించుకుంటున్నారు. ఇక ప్రత్యేకంగా నువ్వు తనని చూసేదేమిటి? నిజం చెప్పాలంటే కావ్యే నీకోసం ఎక్కువ కష్టపడుతోంది. కానీ నువ్వు మాత్రం ప్రతీదానికీ నీ మాటే నెగ్గాలని చూస్తావు. ఇదేం బాగాలేదురా!'' అంది వర్ధనమ్మ.

''ఛీ, మీ ఆడాళ్లంతా ఇంతే. ఎంత చేసినా గుర్తింపు ఉండదు మీకు'' అన్నాడు శరత్.

''ఒరేయ్, భార్యాభర్తల మధ్య ఉండవలసింది గుర్తింపులు, ఎవరు ఎక్కువ ఎవరు తక్కువ అనే భావన కాదురా. ఒకరికోసం ఒకరు అనే అవగాహన! ఒకరి మీద ఒకరు గెలుపు సాధించాలని ఆలోచించే బదులు ఒకరికొకరు ఓడిపోయి రెండోవారి మనసు గెలుచుకోవాలిరా. అదిరా దాంపత్యమంటే! మీరు మాకంటే బాగా చదువుకున్నవాళ్లు, విజ్ఞానవంతులు. వివేకంగా నడుచుకుంటే జీవితం ఆనందమయంగా ఉంటుంది. పాపం అది బాధపడుతూ వెళ్లింది. ట్రైన్ అందుకుందో లేదో ఒకసారి ఫోన్ చేసి మాట్లాడు!'' అంటూ వెళ్లిపోయింది వర్ధనమ్మ అక్కడి నుండి.

తల్లి వెళ్లాక ఆలోచనలో పడిపోయాడు శరత్. నేను కొంచెం ఎగ్రెస్సివ్‌గా బిహేవ్ చేశాను అనుకున్నాడు. వెంటనే సెల్ తీసుకొని కావ్యకు రింగ్ చేశాడు. సెల్ స్విచ్ ఆఫ్ అని సమాధానం రావడంతో మళ్లీ కోపం తన్నుకొచ్చింది శరత్‌కి. దీనికి ఎంత పొగరు కాకపోతే సెల్ ఆఫ్ చేస్తుంది? నేనన్నా నా మాటన్నా కొంచెం కూడా లెక్కలేదు. దీనికి బుద్ధి చెప్పాలి అంటే నా సెల్ కూడా ఆపేస్తాను, అని కసిగా సెల్ స్విచ్ ఆఫ్ చేసి మంచం మీద గిరాటేశాడు ఫోన్‌ను.




★ ★ ★

పరుగులు పెడుతూ కావ్య ఎక్కిన రెండు నిముషాలకే రైలు కదిలింది. తన సీటు వెదుక్కుని కొంచెం స్థిమితపడ్డాక శరత్‌తో ఇలా గొడవపడి రావడం సరైనదేనా అనే ఆలోచనలో పడిపోయింది కావ్య.

అంతలోనే అనుకుంది, నేను ఎంత సర్ది చెప్పాలని చూసినా తన మాట తనదే గానీ నా మాట వినిపించుకోడేం అసలు. కానీ, ఏం జరిగితే అదే జరుగుతుంది. ఎప్పటికప్పుడు సర్దుకుపోతున్న కొద్దీ జులుం ఎక్కువయిపోతుంది.

అలా అనుకుందే గానీ ఒక్క నిముషం కూడా స్థిమితంగా ఉండలేకపోయింది కావ్య. పాపం శరత్ బాధపడుతున్నాడేమో.. అన్నం తిన్నాడో లేదో ఈ పూట? ఇప్పుడు నేనీ పెళ్లికి వెళ్లకపోతే కీర్తి ఎంత బాధపడుతుంది. అందరూ శరత్‌ని ఎంత తక్కువగా అంచనా వేస్తారు? పాపం శరత్.. మనిషి మంచివాడేగానీ ఉత్త మొండివాడు. నేనంటే ప్రాణం పెడతాడు కానీ, నా మనసుని పట్టించుకోడసలు. నోటికి ఎంత వస్తే అంత అనేస్తాడు. తానన్నది కరెక్టు కాకపోయినా అదే సరైంది అని అడ్డంగా వాదించి ప్రాణం తీసేస్తాడు.

నేనిలా వచ్చేసినందుకు అయ్యగారు బాగా అలుగుతారు. వచ్చాక తీరిగ్గా బతిమాలుకుంటాను. ఏం

## చెక్ బౌన్స్

**రంభ** తాజాగా నటిస్తున్న 'దొంగసచ్చినోళ్లు' సినిమా గొడవల్లో పడింది. ఎలాగంటారా? తనకి రావాల్సిన రెమ్యునరేషన్ బ్యాలన్స్ అమౌంట్ తాలూకు చెక్కు బ్యాంక్‌లో బౌన్స్ కావడంతో నిర్మాత తలపై 'మా'లో ఫిర్యాదు చేసిందిట రంభ. రఘుబాబు-కృష్ణభగవాన్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్న ఈ సినిమాలో మరో ముఖ్య భూమికను రంభ ధరిస్తోంది. మరి ఈ సంఘటన సామరస్యంగానే పరిష్కారం కావాలని సినీజనాలు ఆశిస్తున్నారు. ఏమవుతుందో చూద్దాం!



చేస్తాను మరి? అనుకుంది కావ్య చిన్నగా నవ్వుకుంటూ, అలిగినప్పుడు అతను చేసే చిలిపి అల్లరి గుర్తుకు వచ్చి.

రెండు నెలల క్రితం తన పుట్టినరోజునాడు తనకి చెప్పకుండా చీరా ఉంగరం తెచ్చాడు శరత్. ఆ ఉంగరం కాస్త లూజ్ అయిపోయింది. నన్ను కూడా నీ వెంట షాపుకి తీసుకువెళితే నా వేలికి సరిపోయేది తీసుకుందును కదా అంటే, ఎంత కోపం వచ్చింది శరత్‌కి.. నేనేదో నిన్ను సర్ప్రయిజ్ చేద్దామని తెస్తే గాలి తీసేశావు కదా అన్నాడు నిష్టూరంగా.

ఎంత సర్ప్రయిజ్ అయినా నాకు చాలనిది నేనేం చేసుకోను అంటే, ఎంత మండిపడ్డాడో! ఆ తరువాత అతడ్ని చల్లబరిచేసరికి తాతల దిగివచ్చారు కదా నాకు అనుకుంది కావ్య.

అయితే అంతకంటే అద్భుతాన్ని శరత్ తన కోసం దాచిపెట్టాడని ఆరోజు రాత్రి డైరీ చూసేవరకూ కావ్యకు తెలియదు. అందులో...

మై స్వీట్ డెవిల్!

మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే.. నాకు తెలుసు నేనిచ్చిన కానుకలకంటే నేను రాసే ఈ నాలుగు అక్షరాలే నిన్ను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తాయని.

నాకీ ప్రపంచంలో అందరికంటే, అన్నిటికంటే నువ్వే ఎక్కువ. నువ్వంటే ఎంత ఇష్టమో మాటల్లో చెప్పలేను. నీ పుట్టిన రోజుకి ఏదైనా అపురూపమైన కానుకను ఇవ్వాలి అనుకున్నాను. మన పెళ్లయ్యాక వచ్చిన నీ మొదటి పుట్టిన రోజు కలకాలం గుర్తుండిపోయేలా చేయాలనుకున్నాను.

ఏ వస్తువు చూసినా అది నీకు కానుకగా ఇచ్చేంత గొప్పగా లేదనిపించింది. అందుకే నా అక్షరాలనే మాలికగా అల్లి నీకు అర్పిస్తున్నాను. అందుకో!

వసంతం వస్తేనే కోయిల కూస్తుందట, మల్లెలు పూస్తాయట...

కానీ నీవున్న చోట నిత్యమూ వసంతమే.. నీ మనసు తోటలో నిత్యం మల్లెలు పూస్తాయి

నీ గొంతులో కోయిల కుహూ కుహూ నాదాలు నాకెప్పుడూ వినిపిస్తూ ఉంటాయి

శరత్కాలంలోనే వెన్నెల తెల్లగా చల్లగా ఉంటుందట..

ఈ శరత్ నీ చెంతనుంటే నీ నవ్వు ఆ వెన్నెలకంటే చల్లగా, తెల్లగా ఉండి

నిత్యం నన్ను అలరిస్తూనే ఉంటుంది

మేఘాలు ముసిరితేనే మయూరాలు నర్తిస్తాయట...

మేఘాలు ముసరకపోయినా నా కంటికి నీవు మయూరంలాగే కనిపిస్తావు

నీ ప్రతి కదలికలో మయూరాన్ని మించిన హొయలు కనిపిస్తుంది నాకు

నీ పుట్టిన రోజు శుభ సందర్భాన ఆకాశంలోని తారకలన్నీ దిగివచ్చి

పుష్పమాలికలై తోరణాలుగా నిలిచాయి మన ముంగిట!

నీ సొగసుకు ధీటుగు, నీ మనసుకు సాటగు ఏ మణిమాణిక్యాలను కానుకగా తేలేను

నీ చెలిమికి సాటగు ఏ చీనీ చీనాంబరాలను ఈయలేను నేను!


అందుకే ఈ అక్షరాలను పేర్చి కూర్చి అందిస్తున్నా కానుకగా.. అందుకో ప్రియనేస్తమా!'

నీ శరత్

అందులో శరత్ రాసిన ప్రతి అక్షరం తన మనసులో ముద్రించుకుంది కావ్య. పదే పదే అతడు రాసిన మాటలను మననం చేసుకున్న కొద్దీ పులకించిపోతోంది ఆమె అంతరంగం.

ఒకసారి సూట్‌కేసు తెరిచి ఆ డైరీ తీసుకొని అతడు రాసిన ఆ కవితను ప్రేమగా చేత్తో నిమిరింది. ఆ తరువాత అక్షరం పొల్లుపోకుండా నిద్ర వచ్చేదాకా ఆ కవితను పదే పదే చదువుతూ గడిపేసింది.

★ ★ ★



ఆ రాత్రి వర్ధనమ్మ శరత్‌ని భోజనానికి ఎన్ని సార్లు పిలిచినా వెళ్లలేదు. కావ్య తన మాట వినకుండా వెళ్లిందనే ఉక్రోషంతో ఏమీ తినకుండానే పడుకున్నాడు. అలా ఆలోచిస్తూనే నిద్రపోయాడు. నిద్రలో చేతికి అలవాటు ప్రకారం.. పక్క మీద భార్య కోసం తడిమాడు. ఖాళీ ప్రదేశం చేతికి తగలడంతో వెంటనే మెలకువ వచ్చేసింది. కావ్య లేకుండా పెళ్లయ్యాక గడిచిన మొదటి రాత్రి ఇది.. శరత్‌కి ఎంతో దుర్భరంగా అనిపించింది. ఒక క్షణం కూడా తనని విడిచి ఉండలేని నా బలహీనతను అలుసు కట్టేసింది కావ్య అనుకున్నాడు.


ఆ నున్నని మెత్తని చెక్కిళ్లని మీటుతూ.. ఇంద్రనీలాల్లాంటి ఆ కళ్లల్లోకి చూస్తూ కాలమంతా గడిపేయాలని.. గుండెల్లో తల దాచుకుని సేద తీరాలని.. ఆ సన్నని నడుముతో సయ్యాటలాడుతూ గడిపేయాలని ఉంటుంది కానీ ఈ కావ్య కొంచెం కూడా అర్థం చేసుకోకుండా వెళ్లిపోయింది.

పెళ్లట.. పెళ్లి! నాకంటే ఎక్కువా ఆ పెళ్లి... రానీ చెప్తాను. ఆ బుగ్గల్ని గట్టిగా.. అయ్యో నొప్పెడతాయేమో.. ఛీ, ఈ పిల్ల నా ప్రాణం తీసేస్తోంది. ఊహల్లో కూడా ఏం చేయనీయదు. సరే నన్ను వదిలేసి వెళ్లిందిగా, దానికి పరిహారంగా నేనెన్నాళ్లుగానో కోరుకుంటున్న కోరికలు అన్నీ.. అవును అన్నీ.. సరిగంగ స్నానాలతో సహా అన్నీ తీర్చేసుకోవాలి.. ఆ ఊహ మనసులో మెదలగానే ఒంట్లో నుండి వెచ్చని ఆవిర్లు రాసాగాయి. పక్కన ఉన్న దిండునే కావ్యగా ఎంచి... కావ్యా.. నా కావ్యా అంటూ గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు శరత్.

★ ★ ★

## పాటల్లేని సమీరా

**సమీరా రెడ్డి అంటేనే కాస్త రొమాంటిక్ డాన్సులున్న పాటలు గుర్తొస్తాయి ప్రేక్షకులకి. కానీ ఆమె నటిస్తున్న హిందీ చిత్రం 'రేస్'లో మాత్రం ఆమెకి ఒక్క పాట కూడా లేకపోవడం విశేషంగానే చెప్పాలి. 'అవును, ఈ సినిమాలో నాకు ఒక్క పాట కూడా లేదు. అయితే ఏం సినిమాలో నా పాత్ర ప్రేక్షకుల్ని బ్రహ్మాండంగా ఆకట్టుకుంటుందనే నమ్మకం నాకుంది' అంటోంది సమీరా రెడ్డి. క్రమంగా గ్లామరస్ పాత్రల నుంచి నటనకు అవకాశం వుండే పాత్రల వైపు దృష్టి మళ్లిస్తోంది సమీర.**




పెళ్ళికి శరత్ రానందుకు కొంచెం బాధపడినా కావ్య వచ్చినందుకు అంతా సంతోషించారు. కీర్తి అయితే కావ్యని గట్టిగా కౌగిలించేసుకుని ''ఇంత టైమయినా నువ్వు రాకపోవడంతో ఇక పెళ్ళికి రావేమోనని ఎంత భయపడ్డానో తెలుసా?'' అంది.

''సరాసరి ఇక్కడికే వద్దామనుకున్నాను. కానీ ఒకసారి ఇంటికి వెళితే అమ్మానాన్నలకు కనపడినట్టుంటుంది. నేను రెడీ అవడానికి కూడా బాగుంటుందని అలా వెళ్లానే బాబూ!'' అంది కావ్య.

''సరి సరి.. మీ కబుర్లు తర్వాత. అవతల పెళ్ళికూతుర్ని చేసేందుకు టైమయిందంటున్నారు రామ్మా!'' అంటూ వచ్చారెవరో కీర్తిని తీసుకువెళ్లేందుకు.

కావ్య పెళ్లి పందిట్లో తిరుగుతూ స్నేహితురాలికి కావలసినవన్నీ అందిస్తూందేగానీ మనసంతా శరత్ చుట్టూనే. తిరుగుతూండడంతో స్నేహితురాళ్ల మాటల్లో గానీ సరదాల్లోగానీ పాలు పంచుకోలేక పోయింది. ఇక్కడికి రావాలీ, వీళ్లందరితో సరదాగా గడపాలని ఎంతో ఆరాటపడిన కావ్య తీరా వచ్చాక వారితో ఫ్రీగా ఉండలేకపోయింది.

అది చూసిన స్నేహితురాళ్లు ''ఇదంతా విరహమే!'' అంటూ వేళాకోళం చేసినా నవ్వేసి ఊరుకుందేగానీ వాదనకు దిగలేదు.

''అందుకే అంటారు పెద్దలు పెళ్లయ్యేదాకా ఈడ పిల్ల.. పెళ్లయ్యాక ఆడపిల్లని'' అంటున్న స్నేహితురాళ్లని చూసి ''ఊరుకోండే బాబూ, దాన్నెందుకలా ఏడిపిస్తారు. రేపు మీది కూడా అదే పరిస్థితి అని మర్చిపోకండి'' అంది కీర్తి.

''అవునవును.. రేపటిదాకా ఎందుకులే! ఇప్పుడు నిన్ను చూస్తే తెలుస్తోందిగా, దాన్నెందుకు వెనకేసుకొస్తున్నావో.. రేపెవరూ నిన్నేమీ అనకుండా ముందు జాగ్రత్తన్నమాట'' అంటూ గొల్లున నవ్వారంతా.

పెళ్లి సందడంతా ముగిసి అప్పగింతలయ్యాక ఇంటికి వచ్చేసింది కావ్య. మరునాడంతా తల్లిదండ్రులతో కబుర్లు చెబుతున్నా.. ఏ క్షణంలోనైనా శరత్ ఫోన్ చేయకపోలాడా అని ఆశగా ఫోన్ వంకే చూడసాగింది. ఉండలేక నాలుగయిదు సార్లు కావ్య రింగ్ చేసినా శరత్ సెల్ ఆఫ్‌లో ఉండడంతో నిస్సహాయంగా ఉండిపోయింది. అతడితో ఏ కమ్యూనికేషన్ లేక పైకి కన్నవారితో ఎంత నవ్వుతూ మాట్లాడుతూ ఉన్నా లోలోపల చెప్పరానంత దిగులుగా ఉంది కావ్యకు. రాత్రయినా అతడి నుండి ఫోన్ కాల్ రాకపోవడంతో తీవ్రమైన నిరాశకు గురైంది.

పడుకునే ముందు తల్లితో అంది కావ్య. ''అమ్మా, నేను రేపు బయలుదేరుతాను''

''అదేంటే, వచ్చిందానివి ఎలాగూ వచ్చావు. రెండు రోజులుండి వెళ్లరాదా?'' అంది సావిత్రమ్మ.

''లేదులేమ్మా, నాకు శలవులు లేవు. ఈ ఇయర్ లీవులన్నీ ఏదో కారణంగా ముందే వాడేసుకున్నాను. ఎల్లుండి డ్యూటీలో జాయిన్ అవ్వక తప్పదు'' అంది కావ్య.

తల్లితో ఆ మాట చెప్పి వచ్చి మంచం మీద వాలిందన్నమాటేగానీ మనసుకి స్థిమితం చిక్కక నిద్రకు దూరమైంది. ఆలోచనలన్నీ శరత్ చుట్టూనే తిరగడంతో అక్కడికి వెళ్లాక అతడిని ఎలా ప్రసన్నం చేసుకోవాలా అని ఆలోచిస్తూ డైరీలో అతను రాసిన వాక్యాలను చదువుతూ ఏ రాత్రికో అలాగే నిద్రలోకి జారిపోయింది.

★ ★ ★


అక్కడ శరత్ తన ఫ్రెండ్ వినోద్ పెళ్లికి వెళ్లాడు. అయితే అతడు ఊహించినట్లుగా అతని ఫ్రెండ్స్ ఎవరూ కావ్యని తీసుకురాలేనందుకు వేళాకోళం చేయలేదు. పైగా వినోద్ కొంచెం నొచ్చుకున్నాడు. ''అరే నా మూలంగా మీ ఇద్దరికీ ఈ ఎడబాటు కలిగిందన్నమాట. సారీరా!'' అన్నాడు.

''సారీ ఎందుకులేరా.. జీవితంలో అప్పుడప్పుడు ఇలాంటి చిన్న చిన్న ఎడబాటులుంటేనే బాగుంటుందిరా.. ఎడబాటు తరువాత కలిసే కలయికలో మజాయే వేరు!'' అన్నాడు ప్రవీణ్.

అంతవరకూ బిగుసుకుపోయి ఉన్న శరత్ వారి మాటలు వినడంతోనే మనసంతా ప్రసన్నంగా మారిపోయింది. పెళ్లయిన తరువాత ఈ సంవత్సర కాలంలో ఒక్కరోజు కూడా భార్యని వదిలి ఉండ

## శభాష్ హంసిక!

**దేశముదురు తర్వాత ఇప్పుడు 'కంత్రీ' సినిమాలో జూనియర్ ఎన్టీఆర్‌తో నటిస్తున్న హంసిక ఇంకా స్కూలు కూడా పూర్తి చేయని గాళ్ అని అందరికీ తెలుసు కదా! ఇటీవలే 'కంత్రీ' సినిమా కోసం సౌతాఫ్రికా వెళ్లొచ్చిన హంసిక మరో నెల వరకూ ఎలాంటి షూటింగులకీ హాజరు కానని చెప్పేసిందిట. కారణం ఏంటంటారా? ఆమె ఇప్పుడు ప్లస్ టూ పరీక్షలు రాస్తోందిట. ఇంత గ్లామర్, డబ్బు వస్తున్నా చదువుని అర్థాంతరంగా ఆపకుండా పూర్తి చేయాలని హంసిక భావించడం అభినందించదగ్గ విషయమే కదా!**



లేదు శరత్. ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ కలిసి రావడమే కానీ ఎవరూ ఎక్కడికీ ఒంటరిగా వెళ్లలేదు. తాను తప్పనిసరిగా వినోద్ పెళ్లికి వెళ్లాలి కనుక భార్యను వదిలి ఉండలేక ఫ్రెండ్స్‌ను అడ్డం పెట్టుకొని కావ్యను ఆపు చేయాలని ప్రయత్నించాడు. తన మనసులో మాట బయటపెట్టేందుకు ఫాల్స్ ప్రెస్టేజి అడ్డు వచ్చిన శరత్ తాను బాధపడి, భార్యను బాధ పెట్టాడు. ఆ నిజం ఇక్కడికి వచ్చాకగానీ గ్రహించలేకపోయాడు.

దాంతోపాటు కావ్య వెళుతూ ఆఖరుగా అన్న మాటలు పదే పదే జ్ఞాపకం రాసాగాయి.. నువ్వెప్పుడూ అందరిలో ఉన్నతంగానే కనబడాలి అంది. ఆ మాటల్లో తపన నేనర్థం చేసుకోకుండా తనని అన్యాయంగా నొప్పించాను అని బాధపడ్డాడు.

పెళ్లికి వెళ్లి వచ్చిన వెంటనే హఠాత్తుగా బట్టలు సర్దుకొని బయలుదేరుతున్న కొడుకుని చూసి ఆశ్చర్యపోయింది వర్ధనమ్మ.

''ఎందుకురా ఇప్పుడు వెళ్లడం? రేపు ఎలాగూ కావ్య ఇక్కడికి వచ్చేస్తుంది కదరా!'' అంది.

''అబ్బ, నీకేం తెలీయదమ్మా.. నేను వెళ్లాలంతే!'' అంటూ బయలుదేరిన శరత్ వంక ఆశ్చర్యంగా చూసింది. వీడెప్పుడూ ఇంతే.. ఆ క్షణాన ఏం తోస్తే అది చేసేస్తాడు అనుకుంది.


ప్రయాణం చేస్తున్నంతసేపూ అవే ఆలోచనలతో గడిపేశాడు. తీరా ఊరు చేరి రిక్షా ఎక్కాక కూడా కావ్య గూర్చే ఆలోచిస్తూ ఉండడంతో ఇల్లు చేరిన విషయం కూడా గమనించలేదు.

రిక్షావాడు ''బాబూ ఇల్లు వచ్చింది'' అని చెప్పడంతో రిక్షా దిగి అతడికి డబ్బులిచ్చి మెల్లగా తలుపు తట్టాడు. తలుపు తీసిన సావిత్రమ్మ అల్లుడిని చూసి ఆశ్చర్యపోయింది. ''బాగున్నావా బాబూ! వస్తున్నట్లు ఫోన్ అయినా చేశావు కాదు!'' అంది.

''అనుకోకుండా బయలుదేరానండీ. లేచిందా కావ్య?'' అనడిగాడు శరత్ షూ విప్పుకుంటూ.

''లేవలేదు. లేపుతానుండు'' అంటూ లోపలికి వెళ్లబోయింది సావిత్రమ్మ.

''వద్దండీ. నేనే వెళతాను'' అంటూ విప్పిన బూట్లు మూలకు నెట్టి కావ్య గదిలోకి వెళ్లి తలుపు దగ్గరకు వేశాడు. ఆనీ ఆననట్లుగా కావ్య మంచం మీద కూర్చుని శిల్పి చెక్కిన శిల్పంలా ఉన్న ఆమెను తదేకంగా చూస్తూండిపోయాడు. స్లీపింగ్ బ్యూటీ అంటే కావ్యే అనుకుంటూ ఆమె గుండెల మీద తెరిచిపెట్టి ఉన్న డైరీని చూశాడు. తాను రాసిన కవిత కనిపించడంతో అది చదువుతూ నిద్రపోయిందని గ్రహించాడు.




నేనంటే కావ్యకు ఎంత ప్రేమో అనుకున్నాడు. అలా అనుకోవడంతోనే కావ్యపై మరింత ప్రేమ ఉప్పొంగగా ఆపుకోలేని తమకంతో వంగి ఆమె పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు.

గాఢనిద్రలో ఉన్న కావ్య వెంటనే ఉలిక్కిపడి కళ్లు తెరిచింది. ఎదురుగా తన పైకి వంగి ఆర్తిగా చూస్తున్న శరత్ కనపడడంతో అది కలో నిజమో అర్థం కాక అయోమయంగా చుట్టూ చూసింది.



అది అర్థం చేసుకున్న శరత్ మరోసారి ఆమె నుదిటిపై ముద్దు ముద్ర వేయడంతో తాను కలగనడంలేదని గ్రహించి తన రెండు చేతులనూ పూలహారంలా శరత్ మెడచుట్టూ వేసి మరింత హత్తుకుపోయింది. కొద్దిసేపు అలా ఉండిపోయిన కావ్య హఠాత్తుగా ఏదో గుర్తు వచ్చినదానిలో శరత్‌ని తోసేస్తూ...

''ఫో, నేను నీతో మాట్లాడను. నువ్వు ఫోన్ చేయలేదు సరే.. నేను ఫోన్ చేసినా సెల్ ఆఫ్ చేసి నన్నేడిపించావు కదా!'' అంది.

''అవును ఏడిపించాను. ఎడబాటులో ఇంత సుఖముంటుందని తెలిస్తే రోజూ ఏడిపిస్తాను. నిజం. నీ పెదవుల మీద ఒట్టు'' అంటూ మరోసారి ముద్దు పెట్టుకు

## అలాంటిదేం లేదు!

**'శివాజీ' తర్వాత శ్రియ తన పారితోషికాన్ని అమాంతం పెంచేసి బెట్టు చేస్తోందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో శ్రియ- తను అలాంటి పోజులేమీ కొట్టడం లేదని తేల్చిపారేసింది. తను ఇప్పటికీ మంచి పాత్రలు లభిస్తే తెలుగు, తమిళ భాషల్లో నటించడానికి సిద్ధమేనని, ముంబాయికి మకాం మార్చినంత మాత్రాన తను ఇక దక్షిణాదికి గుడ్‌బై చెప్పేసినట్టు కాదని ఇటీవల సెలవిచ్చింది. మరి నిర్మాతలు ఆమె మాటల్ని విన్నారో లేదో!**

న్నాడు.

''ఛ, ఫో.. ఇదేం సుఖం.. నేనెంత టెన్షన్ పడ్డానో నీకేం తెలుసు?'' అంది కావ్య కళ్లు చెమ్మగిల్లుతూండగా.

''సారీ కావ్యా, అనవసరంగా నిన్ను బాధపెట్టాను. నిన్ను వదిలి ఉండలేక అలా నీతో పోట్లాట పెట్టుకున్నాను. నిజంగా సారీరా!'' అన్నాడు శరత్ చేతులతో కావ్యను చుట్టేస్తూ.

''ఆ మాట నువ్వు డైరెక్టుగా నాతో చెప్పి ఉంటే నేను అక్కడే ఆగిపోయేదాన్ని కదా. ఈ రెండు రోజులూ మనిద్దరికీ ఇంత మనస్తాపం ఉండేది కాదు కదా!'' అంది కావ్య మరింతగా అతడి గుండెల్లో ఒదిగిపోతూ.

''లేదులే, ఎడబాటు తరువాత కలిసే కలయిక అద్భుతంగా ఉంటుందట. అదేమిటో ఈరోజు రుచి చూద్దాం!'' అన్నాడు శరత్ భార్య వంక చూస్తూ.

''చాల్లే పెద్ద గొప్ప!'' అంటూ అతడి చేతలకు పులకించిపోతూ మరింత హత్తుకుపోయింది శరత్‌ను.

☆